కుండపోత వర్షం

● ఉధృతంగా వాగులు ● గ్రామాలకు రాకపోకలు బంద్ ● నీట మునిగిన పంట పొలాలు

పెనుగంచిప్రోలు: అల్పపీడన ప్రభావంతో కుండపోతగా వర్షాలు పడుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. తప్పని సరి పరిస్థితుల్లో తప్ప ప్రజలు బయటకు రావటం లేదు. పెళ్లిళ్లు అధికంగా ఉండటంతో వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. లింగగూడెం వద్ద గండివాగు ఉధృతంగా ప్రవహించటంతో పెనుగంచిప్రోలు -లింగగూడెంకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు నీట మునిగాయి, రోడ్డు, పొలాలు కనిపించకుండా వరద నీరు ప్రవహిస్తోంది. గ్రామ పంచాయతీ వారు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ముచ్చింతాల సమీపంలోని గండివాగు, అనిగండ్లపాడు వద్ద కూచివాగు, ముండ్లపాడు వద్ద కూడా వాగు పొంగటంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెనుగంచిప్రోలు-మక్కపేట రహదారి మొత్తం కనిపించకుండా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక వాహనదారులు అవస్థలు పడ్డారు. గురువారం ఉదయానికి వాగుల వద్ద వరద మరింత పెరిగే అవకాశం ఉంది. రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఉంది.

వత్సవాయిలో జోరువాన

వత్సవాయి: మండలంలో మంగళవారం రాత్రి నుంచి జోరువాన కురుస్తోంది. పల్లంలో ఉన్న పంట పొలాల్లో నీరు నిలిచింది. 14.8 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదయిందని రెవెన్యూ అధికారులు తెలిపారు. మునేటికి ఎగువ జిల్లాలైన వరంగల్, ఖమ్మం జిల్లాలలో కూడా వర్షాలు పడుతుండడంతో మునేటికి భారీ స్థాయిలో వరదనీరు చేరింది. 9 అడుగుల మేర 12 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. వరదనీటి ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని కాజ్‌వేకు ఇరుపక్కలా రెవెన్యూ, పోలీస్ అధికారులు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు తెలిపారు. అధికవర్షం వల్ల పెనుగంచిప్రోలు రహదారిలో రైల్వే ట్రాక్ వద్ద అండర్ పాస్‌లో వర్షపు నీటి వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ముంచెత్తిన వాన

కంచికచర్ల: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మంగళ, బుధవారాల్లో కుండపోతగా వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కంచికచర్ల మండలం కీసర మున్నేటికి 500 క్యూసెక్కుల వరదనీరు చేరిందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు సక్రమంగా లేకపోవటంతో వర్షపునీరంతా రోడ్లపైనే పారుతున్నాయి. మండలంలోని చెవిటికల్లు లక్ష్మయ్య వాగు పొంగిపొర్లటంతో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.



లింగగూడెం వద్ద గండివాగు పొంగటంతో రోడ్డు, పొలాలు కనిపించకుండా ప్రవహిస్తున్న వరద నీరు



వత్సవాయి: లింగాల కాజ్‌వేకు ఆనుకుని ప్రవహిస్తున్న మునేరు



వత్సవాయి: పత్తి పైరులో నిలిచిన వర్షపు నీరు

క్లుప్తంగా

డివిజన్‌లో 435.4 మి.మీ వర్షపాతం

నందిగామ రూరల్: నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో మంగళవారం రాత్రి 435.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఉపగణాంకాధికారి ప్రసాద్ బుధవారం తెలిపారు. కంచికచర్ల మండలంలో అత్యధికంగా 110.2 మి.మీ వర్షం కురిసిందన్నారు. నందిగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 304.4 మి.మీ వర్షం కురవగా, జగ్గయ్యపేట నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో 131 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వివరించారు. నందిగామ మండలంలో 24.6 మి.మీ, చందర్లపాడు మండలంలో 71.4 మి.మీ, వీరులపాడు మండలంలో 98.2 మి.మీ వర్షం కురిసిందన్నారు. జగ్గయ్యపేట మండలంలో 107.6 మి.మీ, పెనుగంచిప్రోలు మండలంలో 8.6 మి.మీ, వత్సవాయి మండలంలో 14.8 మి.మీ వర్షం కురిసిందని చెప్పారు.

మునేరులో దిగిన వ్యక్తిని క్షేమంగా ఒడ్డుకు చేర్చిన స్థానికులు



శనగపాడు(పెనుగంచిప్రోలు): మునేరులోకి దిగిన వ్యక్తిని స్థానికులు క్షేమంగా ఒడ్డుకు చేర్చిన సంఘటన మండలంలోని శనగపాడు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నందిగామ మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన ఎక్కిరాల రాజు కొంతకాలంగా శనగపాడులో ఉంటూ సుబాబుల్ కర్ర కొట్టే పనులకు వెళ్తున్నాడు. స్నానానికి మునేరులోకి దిగిన రాజు వరద పెరగటంతో నీటిలో చిక్కుకుపోయాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి, ఎస్ఐ అర్జున్ సంఘటనా స్థలానికి వెళ్లి స్థానికుల సాయంతో అతనిని బయటకు తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో భారీ వర్షాలు పడుతున్నందున మునేరుకు వరద మరింత పెరిగే అవకాశం ఉందని, ఎవరూ మునేరులోకి దిగవద్దని హెచ్చరించారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే తాతయ్య



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ఊరచెరువు, ఎర్రకాలువ, వేపలవాగు తదితర ముంపు ప్రాంతాలలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) బుధవారం ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాలనీలు ముంపు బారిన పడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వేపలవాగు, ఎర్రకాలవల వరద నీరు ఊర చెరువులోకి సులభంగా చేరకుండా ఉన్న అడ్డంకులను యుద్ధప్రాతిపదికన తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావు, కౌన్సిలర్లు ఇర్రి నరసింహారావు, పేరం సైదేశ్వరరావు, కూటమి నాయకులు కరణం నరసింహారావు, గింజుపల్లి కృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి

జగ్గయ్యపేటఅర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మనోహర్ అధ్యక్షతన బుధవారం వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ఎటువంటి ప్రమాదాన్నయినా ఎదుర్కొనడానికి ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ అధికారులంతా సంసిద్ధంగా ఉండాలని సూచించారు. పేట పట్టణంతో పాటు మండలంలో వరద ముంపు ప్రాంతాలను గుర్తించి, ముంపునకు గురయ్యే వారి కోసం పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని, ప్రమాదంలో ఉన్నవారిని రక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. అందుకు వివిధ విభాగాల అధికారులంతా సమన్వయంతో వ్యవహరిస్తూ ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావు, పేట మండల ఎంపీడీవో నితిన్, సీఐ వెంకటేశ్వర్లు, పట్టణ, చిల్లకల్లు ఎస్ఐలు రాజు, సూర్య తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు



పెనుగంచిప్రోలు: మత్తు పదార్థాలతో జీవితం చిత్తవుతుందని హెచ్ఎం కె.జలజ అన్నారు. స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బాల్యం నుంచి మత్తు పదార్థాల నిరోధకతను గురించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు



పెనుగంచిప్రోలు కాజ్‌వే వద్ద వరద నీరు



పొలాల్లో వరద నీరు

నందిగామ రూరల్: నందిగామ పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో బుధవారం భారీ వర్షం కురిసింది. మంగళవారం రాత్రి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండటంతో పాటు ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, మున్సిపల్ శాఖాధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా గత అనుభవాల దృష్ట్యా ఎటువంటి ఇబ్బందులు లేకుండా వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించటంతో పాటు అవసరమైన సహాయక చర్యలు అందించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ లోవరాజు తెలిపారు.

పునరావాస కేంద్రాల ఏర్పాటు..

మండలంలోని ఆయా గ్రామాలతో పాటు పట్టణంలోని ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను తరలించేందుకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ సురేష్ బాబు తెలిపారు. మండలంలోని కంచల, మాగల్లు, ఐతవరం గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉండటంతో ఆయా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలు, సొసైటీ భవనాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అదే విధంగా పట్టణంలోని కుమ్మరిబజార్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదురు సందు, అనాసాగరం పరిధిలోని పలు ప్రాంతాలకు సంబంధించి మహిళా పాలిటెక్నిక్ ట్రైనింగ్ సెంటర్, బాబూ జగ్జీవన్‌రామ్ భవనాలలో ఏర్పాటు చేశామని చెప్పారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో బాలకృష్ణ చెప్పారు.

మునేరుకు భారీ వరద

పెనుగంచిప్రోలు: ఎగువ ప్రాంతాలైన ఖమ్మం, వరంగల్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు మునేరుకు బుధవారం వరద నీరు భారీగా చేరింది. దీంతో శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద మునేరులోకి ఎవరూ వెళ్లకుండా అధికారులు గేట్లు మూయించారు. ఆలయానికి చెందిన మునేరులోని తాగునీటి పైపులైన్ వరద నీటికి కొట్టుకు పోవటంతో బావి, బోరు ద్వారా ట్యాంకర్‌కు నీరు ఎక్కించి భక్తులకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. మునేరు వరద నీరు ఇంకా పెరిగితే ఇప్పటికీ తువ్వ కాలువ గండ్లు పూడ్చకపోవటంతో వరద నీరు పొలాలను గత ఏడాది లాగా మళ్లీ ముంచెత్తుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పొలాల గుండా నీరు కొద్దిగా ప్రవహిస్తూనే ఉంది. మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని చెబుతున్న నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సూచనలిస్తున్న ఎస్ఐ అర్జున్

పెనుగంచిప్రోలు: మునేరుతో పాటు మండలంలో వాగులు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎంఎస్‌కే అర్జున్ అన్నారు. వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని మునేరు అవతల మామిడి తోటల్లో ఇతర ప్రాంతాల నుంచి వరి నాట్లు వేయటానికి వచ్చిన వ్యవసాయ కార్మికులతో, తోటల్లో పని చేస్తున్నవారితో బుధవారం రాత్రి ఆయన మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లో వాగుల వైపు వెళ్లవద్దని సూచించారు.

పల్లపు ప్రాంతాలు జలమయం



ఉప్పొంగుతున్న పట్టణ సమీపంలోని పాలేరు



ఉధృతంగా ప్రవహిస్తున్న చిన్నేరు

జగ్గయ్యపేటఅర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరపి లేని వర్షాలతో బుధవారం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. అనేక చోట్ల రోడ్లపైకి నీరు చేరటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. డ్రెయిన్లు పొంగి రోడ్లపైకి నీరు చేరటంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ రోడ్డు, కోదాడ రోడ్డు, ఆర్టీసీ డిపో సెంటర్, వేపలవాగు ప్రాంతం, పాత ఎన్ఎస్‌పీ కాలనీ రోడ్‌లో ట్రాన్స్‌కో ఇండోర్ సబ్ స్టేషన్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. వేపలవాగు, చెరువుబజార్, బంగారుపేట తదితర లోతట్టు ప్రాంతాలలో ఉన్న గృహాల పరిసరాలు వరదనీటితో నిండిపోయాయి. దీంతో వారు గృహాల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. పట్టణానికి ఆనుకుని ప్రవహిస్తున్న పాలేటి నది, చిన్నేరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బలుసుపాడు రోడ్‌లో గ్యాస్ కంపెనీ వద్ద రోడ్డుపైకి వరదనీరు చేరడంతో బలుసుపాడు, అన్నవరం, బూదవాడ, రెడ్డినాయక్‌తండా, హైవేకు రాకపోకలు నిలిచిపోయాయి.

వరద నీటిలో ఆగిపోయిన ఆర్టీసీ బస్సు



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని ముండ్లపాడు గ్రామం వద్ద వాగునీటిలో జగ్గయ్యపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆగిపోయింది. పెనుగంచిప్రోలు నుంచి విజయవాడ వెళ్తున్న బస్సు ఆగిపోవటంతో ప్రయాణికులను వేరే బస్సులో పంపించారు. ముండ్లపాడు గ్రామంలో రెండు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు.

ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వైరా కట్టలేరు



దాములూరు కూడలి వద్ద రాకపోకలు సాగించకుండా కాపలా ఉన్న వీఆర్వో

నందిగామ రూరల్: మండలంలోని దాములూరు, కూడలి గ్రామ సమీపంలోని వైరా కట్టలేరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో కాజ్‌వేపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. తహసీల్దార్ సురేష్‌బాబు వరద ఉధృతిని పరిశీలించి వీరులపాడు-నందిగామ మండలాల మధ్య రాకపోకలను నిలుపుదల చేశారు. ఆ రహదారిపై రాకపోకలు సాగించకుండా రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంప, బారికేడ్‌లు ఏర్పాటు చేయటంతో పాటు వీఆర్వో ముకుందను అక్కడ కాపలా ఉంచారు.



ముండ్లపాడు వద్ద వాగు చప్టాపై వరద నీరు



లింగగూడెం వద్ద నీట మునిగిన వరి పొలాలు



పెనుగంచిప్రోలు-మక్కపేట రోడ్డులో వరద నీరు

నీట మునిగిన పంట పొలాలు

వీరులపాడు: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. ముఖ్యంగా ఎడతెరపి లేని వర్షం కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాలలోని పంట పొలాలు నీట మునిగాయి. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న, మాగాణి పంట పొలాలు జలమయంగా మారి దర్శనమిస్తున్నాయి. రైతులు పత్తి పొలాలలో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపే ప్రయత్నం చేస్తున్నారు.

140 మందికి కంటి పరీక్షలు

నందిగామరూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకే ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్ధన్ అన్నారు. జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కొండూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. శిబిరంలో 140 మందికి కంటి పరీక్షలు చేశారు.

తొలగించిన స్థానంలోనే పెట్టాలని రిట్ పిటిషన్

● మరో ప్రాంతంలో పెడతామన్న స్టాండింగ్ కౌన్సిల్
● కోర్టు చెప్పే వరకు విగ్రహాన్ని మున్సిపల్ కస్టడీలో ఉంచమన్న న్యాయస్థానం

నందిగామ టౌన్: నందిగామ గాంధీ సెంటరులో అక్రమంగా తొలగించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని తొలగించిన స్థానంలోనే తిరిగి ఏర్పాటు చేయాలని కోరుతూ మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కృష్ణ ఉన్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారని హైకోర్టు న్యాయవాది వెలది సాయి శ్రీహర్ష తెలిపారు. రిట్ పిటిషన్‌ను బుధవారం హైకోర్టు విచారించిందన్నారు. రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించాలని కోరుతూ 2022లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైందని అప్పుడు కూడా సుప్రీంకోర్టు డైరెక్షన్ వచ్చేవరకు విగ్రహాన్ని తొలగించవద్దని ద్విసభ్య ధర్మాసనం ఆదేశాలు జారీ చేసిందన్నారు. మరలా ఈ ఏడాది మే తొమ్మిదిన మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసి విగ్రహాన్ని తొలగించేందుకు యత్నిస్తుండగా మరోసారి హైకోర్టును ఆశ్రయించామన్నారు. ఇప్పుడు కూడా రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని తొలగించటం లేదని స్టాండింగ్ కౌన్సిల్ ధర్మాసనానికి చెప్పటంతో సుప్రీం కోర్టు డైరెక్షన్స్ వచ్చేవరకు తొలగించవద్దని సూచిస్తూ రిట్ పిటిషన్‌ను డిస్పోజ్ చేసిందని చెప్పారు. హైకోర్టుకు విగ్రహాన్ని తొలగించమని చెప్పినప్పటికీ అధికారులు రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించారన్నారు. తొలగించిన ప్రాంతంలోనే మరలా ఏర్పాటు చేసుకునేలా ఆదేశాలివ్వాలని కోరుతూ రిట్ పిటిషన్ దాఖలు చేయగా విగ్రహాన్ని మరోచోట ఏర్పాటు చేస్తామని స్టాండింగ్ కౌన్సిల్ కోర్టుకు తెలిపారని చెప్పారు. దీంతో పైన తెలిపిన రెండు ఆర్డర్లను పరిగణన లోనికి తీసుకుని మళ్లీ ధర్మాసనం చెప్పేంతవరకు రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారుల కస్టడీలో ఉంచాలని ఉన్నత న్యాయస్థానం డైరెక్షన్ ఇచ్చినట్లు న్యాయవాది తెలిపారు.

బ్లాక్ చైన్ రంగంతో విద్యార్థులకు మెరుగైన అవకాశాలు



పోస్టర్ ప్రజెంటేషన్ చేస్తున్న సాహిత్యారాయ్

కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో రైజ్ ఇన్ క్లబ్ ఆధ్వర్యంలో రైజ్ ఇన్ కమ్యూనిటీ, రైజ్ ఇన్ టెక్ నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ బుధవారం తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రైజ్ ఇన్ బ్లాక్ చైన్ నిపుణులు భూపేంద్ర చౌహాన్, సాహిత్యారాయ్ పాల్గొని ప్రసంగించారు. ఈ ప్రోగ్రామ్‌కు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల, పీవీపీ సిద్ధార్థ కళాశాల, కేఎల్ యూనివర్సిటీ నుంచి, ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 200 మంది విద్యార్థులతో పాటు మిక్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైజ్ ఇన్ బ్లాక్ చైన్ నిపుణులు భూపేంద్ర చౌహాన్, సాహిత్యారాయ్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి సారిగా మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బ్లాక్ చైన్ రంగాన్ని అందిపుచ్చుకునేవారికి జీవితంలో స్థిరపడేందుకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ కె.పాండురంగారావు, మేనేజ్‌మెంట్ సభ్యులు ఎం.సుహాస్, వివిధ విభాగాల అధ్యాపకులు, పలు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ కొలగాని వెంకయ్య హఠాన్మరణం



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కొలగాని వెంకయ్య(70) బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వెళ్లారు. మంగళవారం దర్శనం చేసుకున్నారు. బుధవారం మరొక దర్శనానికి వెళ్లేందుకు ఉదయం వారి కుటుంబ సభ్యులు వెంకయ్యను నిద్ర లేపుతుండగా అప్పటికే మృతి చెంది నిర్జీవంగా ఉన్నారు. గుండెపోటుతో మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడు వెంకయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపట్ల వివిధ పార్టీల నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

కమిషనర్‌ను దూషించేంత స్థాయికి దిగజారలేదు

● నీతిమాలిన రాజకీయాల కోసం నా వ్యక్తిత్వాన్ని దిగజార్చుకోను
● విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: కమిషనర్‌ను నిర్బంధించి అసభ్య పదజాలంతో దూషించేంత స్థాయికి తాను దిగజారలేదని, నీతిమాలిన రాజకీయాల కోసం తన వ్యక్తిత్వాన్ని దిగజార్చుకోనని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నందిగామలో అక్రమ కేసుల పరంపర కొనసాగుతూనే ఉందన్నారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడతామని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులను ప్రశ్నిస్తామని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించవద్దని ఉన్నత న్యాయస్థానం చెప్పినప్పటికీ అర్ధరాత్రి అమానుషంగా తొలగించారని చెప్పారు.

విగ్రహం తొలగించేందుకు కారణాలు అడిగాం

కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసి గాంధీ సెంటరులోని దివంగత నేత విగ్రహాన్ని తొలగించేందుకు యత్నిస్తుంటేనే హైకోర్టును ఆశ్రయించామని మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తెలిపారు. ఈ క్రమంలో స్టాండింగ్ కౌన్సిల్ హైకోర్టులో రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించడం లేదని చెప్పారని, దీంతో కోర్టు రిట్ పిటిషన్‌ను డిస్పోజ్ చేసిందని వివరించారు. హైకోర్టుకు విగ్రహం తీయమని చెప్పిన తరువాత కూడా రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించటానికి కారణాలు చెప్పమని కమిషనర్ లోవరాజును లిఖితపూర్వకంగా తెలపాలని అర్జీ అందజేశామని తెలిపారు. స్పందించిన కమిషనర్ రెండు రోజుల్లో ఇస్తామని చెప్పారని, కాదు ఇప్పుడే కావాలని కోరగా వెంటనే టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌తో మాట్లాడి రాయించి ఇచ్చారని చెప్పారు.

దుర్భాషలు, నిర్బంధాలకు చోటు లేదు

మున్సిపల్ కార్యాలయానికి వెళ్లగానే కమిషనర్ గౌరవంగా ఆహ్వానించారని జగన్‌మోహనరావు తెలిపారు. తమకు కావాల్సిన వివరాలు అడగ్గా, ఆయన ఇచ్చారని, సామరస్యంగా, స్నేహపూర్వకంగానే మాట్లాడామని, ఎటువంటి దుర్భాషలు, నిర్బంధాలకు అవకాశం లేదని చెప్పారు. గెజిటెడ్ అధికారిగా ఉన్న కమిషనర్ తన వ్యక్తిత్వాన్ని దిగజార్చుకుని పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేయటం బాధాకరమన్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు

మున్సిపల్ కమిషనర్‌ను దుర్భాషలాడారు.. నిర్బంధించారంటూ తనతో పాటు మరో 16 మందిపై పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేశారని, ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని జగన్‌మోహనరావు స్పష్టం చేశారు. రాజశేఖర్‌రెడ్డి విగ్రహం తొలగింపు విషయాన్ని వదిలే ప్రసక్తే లేదని, దీనిపై ఇప్పటికే న్యాయపోరాటం చేస్తున్నామని, ఇకపై కూడా చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మహ్మద్ మస్తాన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగా వేడుకలు



జగ్గయ్యపేట అర్బన్: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు పట్టణంలో బుధవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు యాపోగు రాజా, ప్రధాన కార్యదర్శులు నల్లబోతు శివ, జొన్నలగడ్డ షణ్ముఖ ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులు, అధ్యాపకులు తిరంగా యాత్ర నిర్వహించారు. జాతీయ జెండాను చేత పట్టి పట్టణంలోని ప్రధాన వీధుల్లో తిరంగా యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో చేగు స్కూల్ విద్యార్థులు తిరంగా గానాన్ని ఘోష్ వాద్యాలతో ప్రదర్శించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు 500 మీటర్ల జాతీయ జెండాతో సుమారు 1500 మంది పాల్గొన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నెపాగ ప్రపుల్లశ్రీకాంత్, జిల్లా కోర్ కమిటీ సభ్యుడు కీసర రాంబాబు, నియోజకవర్గ కన్వీనర్ మన్నె శ్రీనివాస్, టీడీపీ నాయకులు శ్రీరాం సుబ్బారావు, శ్రీరాం ధనుంజయ, ధూళిపాళ్ల లక్ష్మణరావు, బీజేపీ జిల్లా కార్యదర్శి కల్లూరి శ్రీవాణి, బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతిరావు, పట్టణ యువమోర్చా అధ్యక్షుడు రామిశెట్టి గోపి, కౌన్సిలర్లు కె.రామలక్ష్మి, నరసింహారావు, సైదేశ్వరరావు, గొట్టె నాగరాజు, సంగెపు బుజ్జిబాబు, వెంకట్, హిందూ చైతన్య వేదిక పట్టణ అధ్యక్షుడు సంకా భాస్కర్, ఆర్ఎస్ఎస్ ప్రముఖ్‌లు ఎంవీఎస్ సాయి, కంబాల గోపి, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి వీరబాబు పాల్గొన్నారు.

స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తిని కాపాడుకోవాలి



నందిగామ రూరల్: స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలో 79 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థులతో కలిసి బుధవారం ఆజాదీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గోపీనాయక్, షేక్ ఖజు, నరసింహ, అభిషేక్, వెంకటేష్, ప్రసాద్, ప్రజా సంఘాల నాయకులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుతో పట్టణంలో బీజేపీ నాయకులు బుధవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి 200 అడుగుల జాతీయ జెండాతో పట్టణంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తొర్లికొండ సీతారామయ్య, పులిపాటి లక్ష్మణరావు, ఊటుకూరు సత్యనారాయణ, ఓరుగంటి నరసింహారావు, కామేశ్వరరావు, శ్రీదేవి, వెంకట్రావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.